క్లుప్తంగా

గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



కేఆర్‌బీ పురంలో గర్భిణుల ఆరోగ్య పరీక్షల రిపోర్టు పరిశీలిస్తున్న డాక్టర్ జగన్‌మోహన్

కొమరాడ: గర్భిణుల ఆరోగ్యంపై వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా ప్రోగ్రాం అధికారి టి.జగన్‌మోహన్‌రావు అన్నారు. మండలంలోని కూనేరు రామభద్రపురం పీహెచ్‌సీలో ప్రధానమంత్రి సురక్ష మాతృత్వం అభియాన్ పథకంపై గురువారం ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గర్భిణికి ప్రతీ వారం కచ్చితంగా రక్త పరీక్షలు నిర్వహించాలని, కచ్చితంగా పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అంతర పంటలతో అధిక ఆదాయం



ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన

జియ్యమ్మవలస: అంతర పంటలతో అధిక దిగుబడులు సాధించి మంచి ఆదాయం పొందవచ్చని ప్రకృతి వ్యవసాయ అసోసియేట్ జి.అన్నపూర్ణ రైతులకు సూచించారు. మండలంలోని చింతలబెలగాం గ్రామంలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై ఆయన గురువారం అవగాహన కల్పించారు. జొన్న, సజ్జ, ఆముదం, కంది, బీర, బెండ, గోంగూర, మెంతికూర, తోటకూర, చిక్కుడు, రాగి తదితర 12 రకాల పంటలు వేయడం వల్ల అన్ని రకాల పోషకాలు కలిగిన ఆహార పదార్థాలు కుటుంబ అవసరాలకు వినియోగించుకోవడంతో పాటు అదనపు ఆదాయం సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ మండల ఇన్‌చార్జ్ బి.ధనుంజయరావు, ఎం.సింహాచలం, రవి తదితరులతో పాటు రైతులు పాల్గొన్నారు.

అటవీ ఉత్పత్తుల కొనుగోలుకు సిద్ధం



డొంగరకిక్కువ గ్రామస్తులకు అటవీ ఫలసాయాల ధరలను వివరిస్తున్న బీఎం కృష్ణప్రసాదరావు

గుమ్మలక్ష్మీపురం: అటవీ ఉత్పత్తుల కొనుగోలుకు జీసీసీ ఎప్పుడూ సిద్ధంగా ఉందని జీసీఎంఎస్ బ్రాంచ్ మేనేజర్ వి.కృష్ణప్రసాదరావు అన్నారు. మండలంలోని నెల్లికిక్కువ పంచాయతీ డొంగరకిక్కువ గ్రామస్తులతో ఆయన గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ ఉత్పత్తులను జీసీసీ ద్వారా మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేస్తున్నామన్నారు. అటవీ ఉత్పత్తుల సేకరణలో మెలకువలు, నాణ్యత ప్రమాణాలు పాటించి, దళారులకు కాకుండా జీసీసీ కొనుగోలు కేంద్రాల వద్ద లేకుంటే డీఆర్ డిపోల వద్దనే విక్రయించాలన్నారు. ఆయన వెంట గొడాం సూపరింటెండెంట్ ఎం.సాంబశివరావు, సేల్స్‌మేన్ ఉన్నారు.

విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ

గరుగుబిల్లి: మండలంలోని చిలకాం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.మహేష్, సహోపాధ్యాయులు కె.రామ్మోహనరావు దుప్పట్లు, నోట్‌పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లను గురువారం అందజేశారు. పాఠశాలలో చదువుతున్న ఆర్థికంగా వెనుకబడి వున్న విద్యార్థులను గుర్తించి వారికి ప్రస్తుత సీజన్‌లో అవసరమైన దుప్పట్లతో పాటు చదువుకు అవసరమైన సామగ్రిని అందజేసినట్లు వారు పేర్కొన్నారు.

అవగాహన తప్పనిసరి

- ఎస్సై ప్రయోగమూర్తి



మాట్లాడుతున్న ఎస్సై ప్రయోగమూర్తి

పాలకొండ రూరల్: ట్రాఫిక్ నిబంధనలపై యువత అవగాహన పెంచుకోవాలని పాలకొండ ఎస్సై కె.ప్రయోగమూర్తి అన్నారు. సంకల్పం కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు సురక్షిత ప్రయాణాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాలను మితిమీరిన వేగంతో నడపడం, సీట్ బెల్ట్, హెల్మెట్ వినియోగం, తదితర అంశాలపై వివరించారు. కార్యక్రమంలో ప్రిన్స్‌పాల్ ఎం.శ్యాంబాబు, వైస్ ప్రిన్స్‌పాల్ బి.జయమణి, ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్, ఐక్యూఏసీ ప్రతినిధులు బి.రాజు, ఎం.శాంతి, పి.రాజ్యలక్ష్మి, ఎ.శ్రీనివాసరావు, దర్మారావు తదితరులు పాల్గొన్నారు.

ముందే వచ్చిన సంక్రాంతి..



వీరఘట్టం: గాలిపటాలు ఎగురవేస్తున్న దశుమంతపురం ఉపాధ్యాయులు, విద్యార్థులు

మరో నాలుగు రోజుల్లో రావాల్సిన సంక్రాంతి ముందే వచ్చింది. ఇందుకు పాఠశాలలు, కళాశాలలు వేదికలయ్యాయి. ఆయా పాఠశాలల్లో సంక్రాంతి సంబరాలు గురువారం ఘనంగా నిర్వహించారు. రంగురంగుల ముగ్గులతో పాఠశాలల ఆవరణలను అందంగా ముస్తాబు చేశారు. భోగి మంటలు వేసి బాలబాలికలతో పాటు ఉపాధ్యాయులు సందడి చేశారు. చిన్నారులకు ఉపాధ్యాయులు భోగిపళ్లు పోశారు. గాలిపటాలు ఎగురవేయడంతో పాటు చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలతో పాఠశాలల్లో సందడి వాతావరణం నెలకొంది.

– వీరఘట్టం/పాలకొండ



పాలకొండ: తమ్మినాయుడు కళాశాలలో విద్యార్థినుల కోలాటం



పాలకొండ: సత్యసాయి కళాశాలలో భోగిమంటలు

వారపు సంతకు సంక్రాంతి శోభ ..



రెడీమేడ్ దుస్తులు కొనుగోలు చేస్తున్న ఆదివాసీ గిరిజనులు

భామిని: మండల కేంద్రంలో గురువారం జరిగిన వారపు సంతకు సంక్రాంతి కళ వచ్చింది. అధిక సంఖ్యలో గిరిజనులు వచ్చి క్రయ, విక్రయాలు చేపట్టారు. పెద్ద పండుగకు కావాల్సిన సరుకులు కొనుగోలు చేయడంతో పాటు వారు తెచ్చిన అటవీ ఉత్పత్తులను విక్రయించారు. కందికాయలు, పెండలం, గుమ్మడి, కందమూలం, చిన్న చెరుకు, కొత్త కుండాలు, వెదురు జిబ్బి, జంగెడలు వంటి వస్తువుల కొనుగోలుకు గ్రామీణులు తరలివచ్చారు. దీంతో వారపు సంత కళకళలాడింది. ప్రతి దుకాణం వినియోగదారులతో కిటకిటలాడింది. గిరిజనులు రెడీమేడ్ దుస్తులు, మేకప్ సామగ్రి, ఎలక్ట్రానిక్స్ వస్తువులు కొనుగోలు చేశారు.

సంక్రాంతి సంబరాలు



కోసంగి భద్ర పాఠశాలలో భోగి మంట

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని టేంకసింగి, కోసంగిభద్రలోని అంగన్‌వాడీ, మండల పరిషత్ పాఠశాలల్లో సంక్రాంతి సంబరాలను గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రతీ ఏడాది సంక్రాంతి సెలవులకు ముందు రోజున సంక్రాంతి సంబరాలు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుంది. ఈ సందర్భంగా సంక్రాంతికి సంబంధించి విశిష్టత, సంప్రదాయాల గూర్చి ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. భోగి మంటలు, గొబ్బెమ్మలు, పిండి వంటలు, ఆటపాటలతో విద్యార్థులు గడిపారు. కార్యక్రమంలో ఇరిడి ఎంపీటీసీ కద్రక మల్లేశ్వరరావు, ఉపాధ్యాయులు ఝాన్సీ, మహలక్ష్మి, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న ప్రిన్సిపాల్ సత్యనారాయణ

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): విద్యార్థి దశ నుంచే మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని బీసీ వెల్ఫేర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ పి.సత్యనారాయణ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని బీసీ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, కెరీర్ గైడెన్స్, మాదక ద్రవ్యాల నివారణపై గురువారం అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. మొబైల్ ఫోన్‌ను విజ్ఞానం కోసమే ఉపయోగించాలని, ఆన్‌లైన్ గేమ్‌లు, బెట్టింగ్‌లకు దూరంగా ఉండాలన్నారు. వ్యక్తిగత ఆరోగ్యం, పరిశుభ్రత, ఏకాగ్రత, వ్యక్తిత్వ వికాశానికి ఎంతో దోహదం చేస్తుందన్నారు. పదో తరగతి విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా పరీక్షలకు సన్నద్ధం కావాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నోట్‌బుక్కు, పెన్నులను వితరణ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఫాతిమ, వార్డెన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ ఇన్నోవేషన్ ఫెయిర్ ప్రారంభం



సైన్స్ ఇన్నోవేషన్ ఫెయిర్‌ను తిలకిస్తున్న ఎంఈఓ, ప్రిన్సిపాల్

జియ్యమ్మవలస: మండలంలోని చినమేరంగి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎస్.రమణ ఆధ్వర్యంలో సైన్స్ ఇన్నోవేషన్ ఫెయిర్ - 2025 జరిగింది. కార్యక్రమాన్ని ఎంఈఓ-2 శ్రీనివాసరావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు కళాశాలలకు ధీటుగా ప్రభుత్వ కళాశాలల్లో మెరుగైన సదుపాయాలు అందజేస్తున్నారని తెలిపారు. ఈ ఫెయిర్‌లో జియ్యమ్మవలస, బీజేపురం, చినమేరంగి పిప్పలబద్ర, పెదమేరంగి ఉన్నత పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ రమణ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ప్రభుత్వ పాఠశాలలోనే చదివి, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరాలని అన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు వీకేజీ మహారాణా, సిబ్బందితో పాటు ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు శోచనీయం

గుమ్మలక్ష్మీపురం(కురుపాం):

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై బీజేపీ అగ్రనేత, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా ఇటీవల రాజ్యసభలో మాట్లాడిన అహంకార పూరిత వ్యాఖ్యలు అంబేడ్కర్ యొక్క వ్యక్తిత్వాన్ని-అస్తిత్వాన్ని దిగజార్చేలా ఉన్నాయని కురుపాం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ కో- ఆర్డినేటర్ అడ్డాకుల చిన్నారావు మండిపడ్డారు. ఈ మేరకు ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు షర్మిలా ఇచ్చిన పిలుపు మేరకు గురువారం కురుపాం నియోజకవర్గం కేంద్రంలో గల డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. తక్షణమే తన మంత్రి పదవికి అమిత్‌షా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు పత్తిక లక్ష్మయ్య, ఆరిక ధర్మారావు, నిమ్మక పెంటమ్మ తదితరులు పాల్గొన్నారు.



అమిత్‌షా వ్యాఖ్యలపై నిరసన తెలుపుతూ కురుపాంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

శానిటేషన్ సిబ్బందికి సేఫ్టీ కిట్లు

పాలకొండ రూరల్: నగర పంచాయతీ శానిటేషన్ సిబ్బందికి సేఫ్టీ కిట్లను చైర్మన్ పల్లా ప్రతాపరావు చేతుల మీదుగా గురువారం అందించారు. పారిశుధ్య సిబ్బందికి గ్లౌజులు, మాస్కులు, బూట్లు, తదితర సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు వెలమల మన్మధరావు, కడగల వెంకటరమణ, కిల్లారి మోహనరావు, తూముల లక్ష్మణరావు, గంటా సంతోష్‌కుమార్, పడాల రాంబాబు, నగర కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావు, తదితరులున్నారు.



శానిటేషన్ సిబ్బందికి కిట్లు అందిస్తున్న నగర పంచాయతీ చైర్మన్, కౌన్సిలర్లు, అధికారులు

నేడు వైకుంఠ ఏకాదశి



శ్రీవారి ఆలయం

సీతంపేట: టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని ఉత్తరద్వార దర్శనం ఏర్పాట్లు పూర్తి చేశారు. తిరుప్పావై, అర్చనతోమాల, అభిషేక ఏకాంతం, శుద్ధి, అర్చనతోమాల, ఏకాంతసేవ, తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

స్వామి వివేకానంద స్ఫూర్తి ప్రదాత



విజేతలతో హెచ్‌ఎం, సహచర ఉపాధ్యాయులు

పాలకొండ రూరల్: స్వామి వివేకానంద యువతకు స్ఫూర్తి ప్రదాత అని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం మీసాల సూర్యనారాయణ అన్నారు. వివేకానందుని జయంతిని పురస్కరించుకుని పాఠశాలలో గురువారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు ఉపాధ్యాయుడు బౌరోతు శంకరరావు మాట్లాడుతూ.. స్వామి వివేకానంద జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు. అనంతరం వ్యాసరచన, వక్తృత్వ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దన్నాన నారాయణరావు, అనంతరావు, బాబూరావు, తదితరులు పాల్గొన్నారు.

వేరుశనగ సాగులో ఎరువుల యాజమాన్యం

గరుగుబిల్లి: రబీ సీజన్‌లో వేరుశనగ సాగులో అధిక దిగుబడులు సాధించాలంటే ఎరువుల యాజమాన్య పద్ధతులు పాటించాలని ఏఓ ఆర్.విజయభారతి పేర్కొన్నారు. గురువారం ఆమె మాట్లాడుతూ ఆఖరి దుక్కిలో ఎకరాకు 4 లేక 5 టన్నుల సేంద్రియ ఎరువు, 100 కిలోల సూపర్ ఫాస్ఫేట్, 33 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్, 18 కిలోల యూరియాను విత్తే సమయంలో వేసుకోవాలన్నారు. అలాగే ముప్పై రోజుల తరువాత 9 కిలోల యూరియాను అంటే తొలిపూత దశలో వేసుకోవాలన్నారు. ఎకరానికి 200 కిలోల జిప్సంను తొలి పూత సమయంలో మొక్కల మొదళ్ల దగ్గర వేసుకోవాలన్నారు. తగిన సమయంలో ఎరువుల యాజమాన్యం, సస్యరక్షణ చర్యలు చేపట్టి మంచి దిగుబడులు పొందవచ్చునన్నారు.

పంటల మార్పిడితో లాభాలు



పంటలను పరిశీలిస్తున్న డీపీఎం షణ్ముఖరాజు

గరుగుబిల్లి: పంటల మార్పిడి విధానం వల్ల ఎన్నో లాభాలు రైతులు పొందవచ్చునని డీపీఎం పి.షణ్ముఖరాజు అన్నారు. మండలంలోని పిట్టల మెట్ట గ్రామంలో ప్రకృతి వ్యవసాయం విధానంలో సాగు చేసిన పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీలో పెసర 80శాతం, మిగిలిన 20శాతంలో అంతర పంటలుగా కొమ్ముశనగలు, తోటకూర, గోంగూర, ముల్లంగి, బెండ, చిక్కుడు తదితర పంటలు వేసుకోవడం వల్ల ప్రధాన పంటకు ఆశించే పురుగులు, తెగుళ్లను సమర్థవంతంగా అదుపు చేయవచ్చునన్నారు. అంతర పంటల వల్ల ఇంటికి కావల్సిన కూరగాయలు, ఆకు కూరలు లభించడంతో పాటు పంటలకు వెచ్చించాల్సిన వ్యయం కూడా తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్.లక్ష్మంనాయుడు, డి.వెంకటనాయుడు తదితరులు పాల్గొన్నారు.



మంచి మార్గంలో నడవాలి

ప్రతిఒక్కరూ మంచి మార్గం ఎంచుకోవాలని ఆధ్యాత్మికవేత్త సామంతుల దామోదరరావు అన్నారు. గురువారం స్థానిక షిర్డీసాయి ఆలయంలో దివ్యజ్ఞాన సంత్సంగ సమావేశం నిర్వంచారు. ఈ సందర్భంగా ఆయన షిర్డీసాయి చేసిన మార్గనిర్దేశం వివరించారు. పరుల పట్ల ప్రేమ, ఆత్మీయత కలిగి ఉండాలని సూచించారు. - పాలకొండ

సమన్వయంతో పట్టణాభివృద్ధి..

పాలకొండ: అధికారులు, పాలకవర్గ సభ్యులు సమన్వయంగా పనిచేసినప్పుడే నగర పంచాయతీ అభివృద్ధి సాధిస్తుందని నగర పంచాయతీ చైర్మన్ పల్లా ప్రతాప్ అన్నారు. గురువారం స్థానిక నగరం పంచాయతీ కార్యాలయంలో సాధారణ, బడ్జెట్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణంలో తిష్ట వేసిన ప్రధాన సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రంథాలయం వద్ద చెత్త పోగులు లేకుండా చర్యలు తీసుకోవాలని సభ్యుడు వెలమల మన్మధరావు కోరారు. దీనికి కమిషనర్ సర్వేశ్వరరావు స్పందిస్తూ, వెంటనే ప్రహరీ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. తాగునీరు, పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పలువురు సభ్యులు సూచించారు. అనంతరం పలు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు.



ఆరోగ్యం కాపాడుకోవాలి..

గర్భిణులు ఆరోగ్యం మెరుగుపరుచుకుంటే సుఖ ప్రసవం అవుతుందని భామిని పీహెచ్‌సీ వైద్యాధికారులు సోయిల్ పసుపులేటి, సంతోషిలక్ష్మి అన్నారు. స్థానిక పీహెచ్‌సీకి వచ్చిన గర్భిణులను గురువారం పరీక్షించారు. ఈ సందర్భంగా గర్భిణులకు భోజనం, వసతి కల్పించారు. - భామిని

చురుగ్గా పారిశుద్ధ్య పనులు



తోటపల్లిలో పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న ఈఓపీఆర్‌డీ

గరుగుబిల్లి: సంక్రాంతి పండగ రానున్న నేపథ్యంలో గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుపరిచేందుకు చర్యలు చేపట్టడం జరుగుతుందని ఈఓపీఆర్‌డీ ఎల్.గోపాలరావు పేర్కొన్నారు. మండలంలోని తోటపల్లి, సుంకి, సంతోషపురం గ్రామాల్లో నిర్వహిస్తున్న పారిశుద్ధ్య పనులు ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండగ దృష్ట్యా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా కాలువలను పరిశుభ్రం చేయడంతో పాటు తీసిన మురుగును ట్రాక్టర్ల ద్వారా తరలించడం జరుగుతుందన్నారు. పారిశుద్ధ్యం నిర్వహణలో అలసత్వం వహిస్తే సిబ్బందిపై చర్యలు తప్పవన్నారు. ప్రజలు కూడా పారిశుద్ధ్యాన్ని మెరుగు పరిచేందుకు సహకరించాలన్నారు. ఆయన వెంట కార్యదర్శి ఎ.లలితకుమారి, ఎస్.రవికుమార్ తదితరులున్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- నగర పంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావు



వార్డు పర్యటనలో కమిషనర్ సర్వేశ్వరరావు

పాలకొండ: ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని నగర పంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావు అన్నారు. పట్టణంలోని పలు వార్డులను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుధ్య పనులు పర్యవేక్షించి, ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. చెత్తను నగర పంచాయతీ ఏర్పాటు చేసిన బుట్టల్లో వేయాలని సూచించారు. కాలువల్లో చెత్త పారబోయడం వల్ల మురుగు పేరుకుపోతోందని తెలిపారు. ప్రజల సహకారంతోనే పట్టణ పరిశుభ్రత సాధ్యమవుతుందని చెప్పారు. ఆయనతో పాటు ఏఈ వరప్రసాద్ ఉన్నారు.

సత్యసాయి మందిరంలో ప్రేమామృత ప్రసాదం పంపిణీ



సత్యసాయి ప్రేమామృతం ప్రసాదంలో పాల్గొన్న గర్భిణులు, రోగులు

జియ్యమ్మవలస: మండలంలోని చినమేరంగి సత్యసాయి మందిరంలో సత్యసాయి ప్రేమామృత ప్రసాదం గర్భిణులు, బాలింతలకు గురువారం అందజేసారు. సాయిబాబా భక్త బృందం జోనల్ కన్వీనర్ నాగరాజు మాట్లాడుతూ ప్రేమామృతం ప్రసాదం పంపిణీకి శిఖబడి గ్రామానికి చెందిన రాయగడ లక్ష్మణరావు అన్ని విధాల సహాయ సహకారాలు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి జగదీష్, సిబ్బంది లక్ష్మీకాంతం, సత్యసాయిబాబా భక్తబృందం, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

చేపల పెంపకం ఎంతో మేలు

వీరఘట్టం:



మాట్లాడుతున్న ఏపీఎం రాము

సమీకృత వ్యవసాయ విధానంలో చేపల పెంపకం ఎంతో మేలని వెలుగు ఏపీఎం కెల్ల రాము అన్నారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆక్వా రంగంలో చేపల పెంపకం ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించవచ్చన్నారు. ఎకరా భూమి ఉన్న రైతులు ఆ భూములను చెరువులుగా మార్చుకుని చేపలను పెంచితే అధిక లాభాలు కళ్లజూడవచ్చన్నారు. చలివేంద్రి పంచాయతీలో ఆక్వా ప్రాజెక్ట్ (కొర్రమీను చేపల పెంపకం కోసం) ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాల సభ్యులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో ఎంఎంఎస్ అధ్యక్షురాలు కె.లలితకుమారి, కె.చిన్నంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం

భామిని: ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లతో ఏపీఓ ఈ. తులసీదాస్ గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మేట్ల విధి విధానాలను వివరించారు. 50 ఏళ్ల లోపు వయసున్న వారినే మేట్‌లుగా నియమించాలని సూచించారు.అలాగే మేట్లు తప్పనిసరి ఆండ్రాయిడ్ ఫోన్‌లు కలిగి ఉండాలని, ఈ విషయాన్ని వారికి తెలియజేసే బాధ్యత ఫీల్డ్ అసిస్టెంట్లపై ఉందన్నారు.